క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్ సబ్ స్టేషన్ పరిధిలోని జవహర్ కాలనీ, విష్ణుపురి కాలనీ, సురేంద్రపురి కాలనీ, మారుతీ కాలనీ, తిరుమల కాలనీ, ఉషోదయ కాలనీ, సదాశివ కాలనీ, ద్వారకసాయి కాలనీ, ఎస్‌వీఎస్ హోమ్స్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. రామన్నపేట, బీట్‌బజార్, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8.30గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు మెగా యోగా క్యాంపు



నయీంనగర్: వికాస తరంగిణి ఆధ్వర్యంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వరంగల్ సీకేఎం కళాశాల మైదానంలో మెగా యోగా క్యాంపు నిర్వహించనున్నట్లు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా యోగా క్యాంపులో త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి, మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో దయాకర్ రెడ్డి, తిరుమల్, విష్ణురెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రస్తావించండి

హన్మకొండ చౌరస్తా: గురువారం జరగనున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రస్తావించి, పరిష్కారం కోసం తీర్మానం చేయాలని సీఐటీయూ, టీఎంఆర్‌పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించే అంశాన్ని కౌన్సిల్‌లో చర్చించాలని సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన మార్నేని



హన్మకొండ: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు కలిశారు. హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో రాజేందర్ రెడ్డిని రవీందర్ రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

'ప్రైవేట్ పాఠశాలల'పై చర్య తీసుకోవాలని వినతి



విద్యారణ్యపురి: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, టీజీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్ హైని బుధవారం కలిసి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం అందరికి సమాన విద్యను అందించాలని సూచించారు. సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు నాగారం మణితేజ, సంతోష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శంభునిపేటకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ 41వ డివిజన్ శంభునిపేటకు చెందిన అబిద్ ఉన్నీస్సా మంగళవారం ఉదయం ఎవరికి చెప్పకుండా ఇంటిలో నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో తల్లిదండ్రులు వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి మహ్మద్ అక్బర్ సర్వర్ బుధవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అసలే సింగిల్‌రోడ్లు.. ఆపై గుంతలు

- ప్రమాదకరంగా దేశరాజుపల్లి, కన్నూరు దారులు
- గాయాల పాలవుతున్న వాహనదారులు
- డబుల్ రోడ్డుగా విస్తరింపజేయాలని స్థానికుల వేడుకోలు



దేశరాజుపల్లి వెళ్లే మార్గంలో కమలాపూర్ వద్ద ఏర్పడిన భారీ గుంత



కమలాపూర్-దేశరాజుపల్లి మార్గంలో గుంతలు



కన్నూరు వెళ్లే దారిలో..

కమలాపూర్ : మండల కేంద్రం నుంచి దేశరాజుపల్లికి, కన్నూరుకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారాయి. ప్రమాదకరంగా మారిన ఆ రోడ్లపై ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఆ రోడ్లపై ఉన్న గుంతల్లో పడి పలువురు వాహనదారులు గాయాల పాలయ్యారని, ఆ రోడ్లపై ప్రయాణించాలంటేనే భయపడాల్సి వస్తోందని ప్రయాణికులు అంటున్నారు. అసలే సింగిల్‌రోరోడ్లు.. ఆపై పెద్దపెద్ద గుంతలు ఓ వైపు దేశరాజుపల్లికి చెందిన విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు.. గ్రామస్తులు, వ్యాపారులు తమ అవసరాల నిమిత్తం కమలాపూర్, దేశరాజుపల్లి, కన్నూరు వెళ్లాలంటే ఈ మార్గాల గుండానే వెళ్లాల్సి ఉంది. వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం తమ వ్యవసాయ భూముల వద్దకు నిత్యం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల రోడ్లపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. రాత్రి సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయపడ్డారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేసి డబుల్ రోడ్డుగా విస్తరింపజేయాలని వాహనదారులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గుంతలు పూడ్చాలి



కమలాపూర్-దేశరాజుపల్లి మార్గంలో రోడ్డంతా దెబ్బతిని పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు పలువురు ఇప్పటికే ఆ గుంతల్లో పడిపోయి గాయాల పాలయ్యారు. సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చి వేసి ప్రమాదాలను అరికట్టాలి.

- మల్రిపెల్లి సమ్మయ్య, మాజీ ఉపసర్పంచ్

డబుల్ రోడ్డుగా విస్తరించాలి



సింగిల్ రోడ్డుగా ఉన్న కమలాపూర్-దేశరాజుపల్లి, దేశరాజుపల్లి-ఉప్పల్ మార్గాలను వెంటనే డబుల్ రోడ్డుగా విస్తరింపజేయాలి. రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న పెద్దపెద్ద గుంతల ఉండడంతో ఎదురుగా ఏదైనా పెద్ద వాహనం వస్తే వెళ్లలేని పరిస్థితి ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- తుమికి తిరుపతిరాజు, మాజీ సర్పంచ్

హామీలను దశలవారీగా అమలు చేస్తాం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ప్రకాశ్‌రెడ్డి

నడికూడ : ఎన్నికలసమయంలో ఇచ్చిన ప్రతీ హామీని దశలవారీగా అమలు చేస్తామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన 64 మంది లబ్ధిదారులకు రూ.64 లక్షల7 వేల 424 విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో రాష్ట్రంలోని ఆడబిడ్డలకు మేలు జరుగుతుందని అన్నారు. నిరుపేద కుటుంబాల ఆడపిల్లల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అండగా నిలుస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వలన చెక్కులు ఆలస్యం అయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో లబ్ధిదారులకు సకాలంలో చెక్కులను అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగారాజు, ఎంపీపీ మచ్చ అనసూర్య, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

- ఎంపీటీసీ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీటీసీ శ్రీనివాస్

శాయంపేట : మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని వైస్ ఎంపీపీ భర్త రాంశెట్టి లక్ష్మారెడ్డి, కొప్పుల ఎంపీటీసీ సభ్యుడు మేకల శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. 2021 నుంచి 2024 సంవత్సరం వరకు మండల పరిషత్ నిధులు, ఎస్ఎఫ్‌సీ, 15 ఆర్థిక సంఘం నిధులతో మండలంలోని వివిధ గ్రామాల్లో 19 లక్షలతో కల్వర్టు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేసి ఎంబీ రికార్డు చేసినప్పటికీ ఎస్‌టీఓలో నిధులు లేక ఇప్పటి వరకూ బిల్లుల చెల్లింపు జరుగలేదని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల కోడ్ పేరుతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిందని, అధికారులను అడిగితే ఎస్‌టీఓలో నిధులు జమ అయ్యాకే సీరియల్‌గా బిల్లులు వస్తాయంటున్నారని తెలిపారు. పనులు పూర్తి చేసేందుకు తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు కోటి రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తనకు 6 లక్షల నిధులు రావాల్సి ఉందని ఎంపీటీసీ మేకల శ్రీనివాస్ వాపోయారు. బిల్లుల చెల్లింపుల విషయమై జిల్లా కలెక్టర్‌ను కలువనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. నడికూడలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరై కేక్ కట్‌చేసి సంబురాల్లో పాల్గొన్నారు. అలాగే అన్ని మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్‌చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



నడికూడ : కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి



వేలేరు : కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



శాయంపేట : కేక్ కట్‌చేస్తున్న నాయకులు

'కస్తూర్బా'కు కుర్చీల బహూకరణ



వేలేరు : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు 'కుడా' మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి బుధవారం కుర్చీలు బహూకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. దాతలు సాయం చేస్తే విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.

'భగీరథ' పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలి

కమలాపూర్ : మండల కేంద్రం నుంచి కన్నూరుకు తాగునీటి సరఫరా కోసం వేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని రైతులు కోరారు. కమలాపూర్ శివారులోని పంట పొలాల్లో లీకై నీరంతా వృథాగా పోతోందని, వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని అన్నారు. తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ తరచూ లీకవుతున్న కారణంగా తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పైప్‌లైన్ లీకేజీల కారణంగా పంట పొలాలకు వేసిన రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు పైపుల్లోకి వెళ్లి తాగునీరు కలుషితమవుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించాలని కోరారు.

రమేశ్‌ను కలిసిన ఢిల్లీ బృందం



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన కూన పులిపటం కథ కళాకారుడు పురాణం రమేశ్‌ను న్యూ ఢిల్లీకి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ బృందం సభ్యులు బుధవారం కలిశారు. తెలుగు రాష్ట్రాల్లోని ఉప జాతుల మీద అధ్యయనంలో భాగంగా సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలప్మెంట్ సొసైటీ, జవర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ బృందం సభ్యులు రమేశ్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ప్రియదర్శిని విజయశ్రీ, డాక్టర్లు శ్రీనివాస్, రామ్‌చంద్రారెడ్డి ఉన్నారు.

కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి



డీపీఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు సమ్మె కాలంలో చెల్లించాల్సిన వేతనాలు, ఆరు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సారంగపాణి, రాజుగౌడ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. అలాగే, గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక యూనియన్ జిల్లా నాయకులు సారయ్య, రమేష్, సుధాకర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల చట్టం అమలులో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

కాజీపేట: కార్మికులకు కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలనే చట్టాన్ని అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి విమర్శించారు. కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కమ్యూనిటీ హాల్‌లో సంఘం ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ సీఐటీయూ పోరాటాలతోనే కనీస హక్కులను ఇంకా కాపాడుకోగలుగుతున్నామని అన్నారు. సమావేశంలో ఎం.చుక్కయ్య, ఓరుగంటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాజీపేట సీఐటీయూ మండల కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా కారు ఉపేందర్, కోకన్వీనర్లుగా రామంచ సారంగపాణి, ఎం.యాకూబ్, కమిటీ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి



ధర్నా చేస్తున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

కేయూ క్యాంపస్: డీఎస్సీ పరీక్షను రద్దుచేసి మెగా డీఎస్సీని నిర్వహించాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్‌వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ టెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు డీఎస్సీ ప్రిపరేషన్‌కు తక్కువ సమయం ఉందని, ఈక్రమంలో మెగా డీఎస్సీని నిర్వహించాలని సూచించారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైన వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ మచ్చ పవన్‌కల్యాణ్, అధ్యక్షుడు దూడపాక నరేందర్, నాయకులు సంపత్, కె.రాజు, సందీప్, సాయి, చంటి, అనిల్, నరేష్, వెంకటేష్, సురేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు



నడికూడ : మాట్లాడుతున్న శ్రీనివాసరావు



పరకాల : సమావేశంలో పాల్గొన్న అధికారులు

నడికూడ : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఆర్‌డీఓ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. త్వరలో కేంద్ర బృందం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ రికార్డుల్లో తప్పులు లేకుండా చూడాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ చిర్రబోయిన శ్రీనివాస్, ఏపీఓలు విద్యావతి, ఎంపీఓ అఫ్జల్, ఈసీ రజనీకాంత్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి అధికారులు ఉపాధి హామీ పనులు, రికార్డుల పరిశీలన చేసేందుకు రానున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన రికార్డులు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. వచ్చే వారంలో కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి (ఎం.ఓ.ఆర్.డీ) బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. పని ప్రదేశం వద్ద ఈజీఎస్ పనులకు సంబంధించిన బోర్డుల ఏర్పాటుతో పాటు జాబ్ కార్డులన్నీ అప్డేట్ చేయాలని అన్నారు. ప్రతి పనికి వర్క్ ఫైల్ ,గ్రామ పంచాయతీలో 7 రిజిస్టర్లు అప్డేట్‌గా ఉంచాలని సూచించారు. సిటిజన్ చార్ట్ ఏర్పాటుతో పాటు మస్టర్ బ్లూఫాంస్ సిద్ధంగా ఉంచాలని అన్నారు. రిజిస్టర్లల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ ఇందిర, టెక్నికల్ అసిస్టెంట్‌లు సుమలత, నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న లావణ్య

దామెర : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిల్లా రమణారెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా ఆయన హాజరై ప్రారంభించారు. రక్తదానం చేసిన కార్యకర్తలను అభినందించారు. అనంతరం కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు జంగిలి లావణ్యవేణు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, శనిగరం సుధాకర్, నాయకులు పాలకుర్తి సందీప్, సదిరం పోశాలు, పంచగిరి రాజు, అర్షం రాజు, దామెర రతన్, రవి, రమేశ్, డబ్బ రవి, జల్సా రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోడను కూల్చిన పంచాయతీ సిబ్బంది



గోడ నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న సిబ్బంది

శాయంపేట : మండల కేంద్రంలోని పోచమ్మ గుడి స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న ప్రహరీని బుధవారం గ్రామపంచాయతీ అధికారులు కూల్చివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మల్టీపర్పస్ సిబ్బందితో కలిసి తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ తెలిపారు. కాగా పోచమ్మగుడి స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మంగళవారం ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎంపీఓ రంజిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఫిర్యాదుపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి ప్రహరీ నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశించినట్లు రత్నాకర్ తెలిపారు.

అక్రమ రవాణాను అరికట్టాలి



ఖిలా వరంగల్: బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణాను అరికట్టాలని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ వరంగల్ కోఆర్డినేటర్ ఈసంపెల్లి సుదర్శన్ సూచించారు. ఖిలా వరంగల్ పడమరకోటలో అంగన్‌వాడీ సెంటర్ నేతృత్వంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు, మహిళల హక్కుల రక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గురువారం జరగనున్న నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.నరేష్ కోరారు.